www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 6 ఆగస్టు 2023
5
వైఎస్ఆర్



దాడులు చేయిస్తూ సిఎం జగన్ రాక్షస ఆనందం

కడప అర్బన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి టిడిపి నాయకులు, కార్యకర్తలపై నిత్యం దాడులు, దౌర్జన్యాలు, దోపిడీలు చేయిస్తూ రాక్షస ఆనందం పొందుతున్నారని టిడిపి అధికార ప్రతినిధి అమీర్ బాబు విమర్శించారు. శనివారం ఎర్రముక్కపల్లె తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు రెహమాన్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగనూరు ప్రజాక్షేత్రంలో జరిగిన దాడి జగన్‌మోహన్‌రెడ్డి రౌడీ పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజల విశ్వాసం కోల్పోయిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అరాచక చర్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. పోలీసులను అడ్డుపెట్టుకుని చంద్రబాబు నాయుడుపై దాడులు చేయించి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో జగన్ ప్రజా వెల్లువలో కొట్టుకుపోవడం ఖాయమని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు రెహమాన్, మైనార్టీ సెల్ నగర ఐటిడిపి అధ్యక్షులు ఇమ్రాన్, వరకుమార్ పాల్గొన్నారు.

ఆర్డినెన్స్‌తో దళిత, గిరిజనులకు నష్టం : వ్య.కా.స



ఆర్డినెన్స్ ప్రతులు దగ్ధం చేస్తున్న వ్య.కా.స నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

అసైన్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పిస్తూ గవర్నర్ ద్వారా ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని, ఈ ఆర్డినెన్స్ వల్ల పేదలకు, దళితులకు, గిరిజనులకు నష్టం వాటిల్లుతుంది. ప్రభుత్వం ఆర్డినెన్స్‌ను రద్దు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, అన్వేష్ డిమాండ్ చేశారు. శనివారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యాలయం పాత బస్టాండు ఆవరణంలో ఆర్డినెన్స్ కాపీలను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసైన్డ్ భూములు అనర్హులకు, స్థానికేతరులకు ఉమ్మడి కడప జిల్లాలో లక్షల ఎకరాలు అనుభవిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్ భూములను యాజమాన్య హక్కులు కల్పిస్తూ గవర్నర్ ద్వారా ఆర్డినెన్స్ తీసుకు వచ్చిందని పేర్కొన్నారు. ఈ ఆర్డినెన్స్ వల్ల అనర్హులో పాలకవర్గాలు వద్ద ఉన్న ప్రభుత్వ భూములను చట్టబద్ధం చేసుకుని కోట్ల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని విమర్శించారు. దళితులు, పేదల వద్ద ఉన్న భూములను గ్రామాలలో భూస్వాములు కారు చౌకగా కొనుగోలు చేసి అనుభవిస్తున్నారని చెప్పారు. ఆ భూములను తిరిగి ఆ పేదలకు ప్రభుత్వం ఇప్పించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకోవాలని పేర్కొన్నారు. పలు సంవత్సరాలుగా వ్యవసాయ కార్మిక సంఘం, భూ పోరాట సాధన కమిటీ రెవెన్యూ ఉన్నత అధికారుల దృష్టికి పలు మార్లు ఆందోళనలు, ధర్నాలు రూపంలో తీసుకువెళ్లిందని తెలిపారు. బినామీ భూములను రద్దు చేసి స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఆధారాలతో తీసుకొస్తే భూములను రద్దు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైనది కాదని పేర్కొన్నారు. భూకబ్జాదారులకు, పాలకవర్గాలకు, భూస్వాములకు ఉపయోగపడేవిధంగా ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని పేర్కొన్నారు. దీన్ని రద్దు చేసే వరకు వ్యవసాయ కార్మిక సంఘం పెద్ద ఎత్తున ఆందోళన, ఉద్యమాలు చేపడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో హేతువాద సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.ఆర్.వి ప్రసాద్, సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

ఆప్కాస్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటసుబ్బయ్య



దీక్షలను ప్రారంభిస్తున్న వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆప్కాస్ ఉద్యోగులను రెగ్యుల్ చేయాలని ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్యదర్శి ఎం.రవి ప్రకాష్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం కలెక్టరేట్ ఎదుట ఒక్కరోజు నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షలో పి.వి.సుదర్శన్, కంచుపాటి ఏసన్న, సురేష్ కుమార్, రఘు, శంకర్రావు, రాజారత్నం కూర్చున్నారు. వీరికి పూలమాలవేసి దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆప్కాస్ కార్మికులకు ఎటువంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపు కావడం లేదని పేర్కొన్నారు. దీనికి కారణం ఆన్‌లైన్‌లో ఆప్కాస్ కార్మికులను రెగ్యులర్ కార్మికులుగా చూపిస్తుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ కార్మికులను ప్రత్యక్షంగా మోసం చేస్తా ఉందని విమర్శించారు. ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నప్పుడు అసెంబ్లీ సాక్షిగా కాంట్రాక్టు వేరు కాదు, అవుట్ సోర్సింగ్ వేరు కాదు అన్న సిఎం జగన్ మోహన్‌రెడ్డి అధికారంలో రాగానే విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాల్లో వ్యత్యాసం చూపిస్తున్నారని పేర్కొన్నారు. ఆప్కాస్ లో పనిచేస్తున్న కార్మికుల తల్లిదండ్రులకు వద్ధాప్య, వికలాంగ పింఛన్లు రావడం లేదని చెప్పారు. వారి పిల్లలకు ఎటువంటి సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. వికలాంగుల పింఛన్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆప్కాస్ కార్మికులు ఎవరైనా వికలాంగులు ఉంటే వారికి కూడా పెన్షన్ రావడం లేదని పేర్కొన్నారు. గతంలో అన్ని సంక్షేమ పథకాలు వర్తించేవని చెప్పారు. ప్రస్తుతం అమలుకాకుండా ఆప్కాస్ కార్మికులను మరింత దయనీయ పరిస్థితిలోకి ఈ రాష్ట్ర ప్రభుత్వం నెట్టివేస్తుందని విమర్శించారు. ముఖ్యమంత్రి ప్రత్యక్ష నాయకుడుగా ఉన్నప్పుడు మేము అధికారంలోకి వస్తే సమాన పనికి సమాన వేతనం అందిస్తామన్నారని, ఇప్పుడు కనీస వేతనం కూడా ఇవ్వకుండా ఆప్కాస్ కార్మికులను ఇబ్బందులు గురిచేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ కార్మికుల సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 14న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విజయవాడ ధర్నా చౌక్ వద్దకు పెద్ద ఎత్తున ఆప్కాస్ కార్మికులందరూ చేరుకుని ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాని పిలుపు నిచ్చారు. ఆందోళనలు ఉద్ధతం చేస్తామని, దీనికి బాధ్యత ఈ రాష్ట్ర ప్రభుత్వమే వహించాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు పి.చంద్రారెడ్డి, డివైఎఫ్‌ఐ నగర కార్యదర్శి డి.ఎం.ఓబులేసు, ఆప్కాస్ కమిటీ సభ్యులు మరియమ్మ, రామకష్ణ, చెన్నయ్య, శ్రీనివాసులు, బాలాజీ రావు, జయ కాంత్ బాబు, వెంకటనారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

డిఇఒపై ఆరోపణలు..విచారణ చేపట్టిన ఆర్‌జెడి

అక్రమాలపై ఆధారాలు సమర్పించిన ఫ్యాప్టో నాయకులు



విచారణకు హాజరై ఆధారాలను ఆర్‌జెడికి సమర్పించిన ఫ్యాప్టో నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఇటీవల జరిగిన ఉపాధ్యాయ బదిలీలలో, పదోన్నతులలో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలపై శనివారం రీజనల్ జాయింట్ డైరెక్టర్ (పాఠశాల విద్య) ఎం.వెంకటకృష్ణారెడ్డి తన కార్యాలయంలో విచారణ చేపట్టారు. డిఇఒ వై.రాఘవరెడ్డి వ్యవహార శైలి వివాదాస్పదంగా మారడంతో పాటు, బదిలీలు, పదోన్నతులలో అక్రమాలు చోటు చేసుకున్నాయనే ఆరోపణలు వివిధ ప్రసార మాధ్యమాల్లో వెల్లువెత్తాయి. ఉపాధ్యాయులు, విద్యార్థులు ధర్నాలలో ర్యాలీలలో పాల్గొన కూడదని, పాల్గొంటే సిసిఎ రూల్స్ ప్రకారం చర్యలు తీసుకుం టామని డిఇఒ జారీచేసిన ఉత్తర్వులు వివాదాస్పదమయ్యాయి. ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే ఈ ఉత్తర్వులను ఉపసంహరించుకోవాల్సిందేనని విద్యార్థి, యువజన సంఘాలతో పాటు ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఉపాధ్యాయుల పట్ల డిఇఒ అభ్యంతరకర భాషను ప్రయోగించడం, ఒక ఉపాధ్యాయుడిని ఫోన్ ద్వారా డిఇఒ దూషిస్తున్న వాయిస్ మెసేజ్ వైరలైయింది. వరుసగా ఆరోపణలు రావడంతో, డిఇఒ వ్యవహార శైలితో పాటు బదిలీలు, పదోన్నతులలో జరిగిన అక్రమాలపై ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టర్, ఆర్జేడీ ఫిర్యాదు చేశారు. ఫ్యాప్టో జిల్లా శాఖ ఫిర్యాదుపై స్పందించిన ఆర్జేడికి బదిలీలు, పదోన్నతులలో జరిగిన అక్రమాలపై ఆధారాలతో విచారణకు హాజరు కావాలంటూ శుక్రవారం ఫ్యాప్టోకు నోటీసులు పంపారు. ఆ మేరకు శనివారం ఆర్జేడి కార్యాలయంలో జరిగిన విచారణకు ఫ్యాప్టో నాయకులు హాజరై అవినీతి, అక్రమాలపై తమ వద్ద ఉన్న ఆధారాలను ఆర్జేడికి సమర్పించారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో చైర్మన్ మాదన విజయకుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బదిలీ, పదోన్నతులలో పలు అక్రమాలు చోటు చేసుకున్నాయని, నిబంధనలకు వ్యతిరేకంగా జిల్లా విద్యాశాఖ అధికారి వ్యవహరించారని ఆరోపించారు. 20 అంశాలపై ఆధారాలతో సహా ఆర్జేడికి అందజేశామన్నారు. పదోన్నతి పొంది మూడేళ్లు దాటిన ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులకు నిబంధనలకు భిన్నంగా రివర్షన్ ఇచ్చి వారికి 16 శాతం హెచ్‌ఆర్ఎలో నియామకాలు చేపట్టారన్నారు. పాఠశాల సహాయకులుగా పదోన్నతి ఇచ్చిన కొద్ది రోజులకే వారి కోరిక మేరకు రివర్షన్ ఇచ్చి వారందరినీ వారికి అనుకూలమైన 16శాతం హెచ్‌ఆర్ఎలో స్థానాలు కట్టబెట్టారన్నారు. దీంతో పాటు జిల్లా విద్యాశాఖాధికారి ఉపాధ్యాయులపై ఉపయోగిస్తున్న భాష తీవ్ర అభ్యంతరకరంగా ఉందన్నారు. ఆరోపణలపై ఆధారాలతో పాఠశాల విద్య కమిషనర్, మరియు పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి ఫిర్యాదు చేస్తున్నట్లు వివరించారు. విచారణలో ఫ్యాప్టో నాయకులు ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.వెంకటసుబ్బయ్య, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, ఏపీటీఎఫ్ (1938) రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆర్.అబ్దుల్లా, బిటిఏ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.హరికొండయ్య, ఆర్జేడి కార్యాలయ పరిపాలనాధికారి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్



సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్

ప్రజాశక్తి - కడప అర్బన్

ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఇచ్చిన హామీని అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ డిమాండ్ చేశారు. శనివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోఆయన మాట్లాడుతూ మాట తప్పను మడమ తిప్పను అన్న సిఎం బహిరంగ సభల్లో ఇచ్చిన హామీలు విస్మరించడం బాధకరమని పేర్కొన్నారు. కార్మికులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని పోరాటాలు చేస్తున్నారని చెప్పారు. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ కార్మికులు పిట్టల్లా రాలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 7న చలో తిరుపతి నిర్వహిస్తున్నామని తెలిపారు. విఆర్ఎలకు రూ.15వేలు ఇస్తానని సిఎం ఇంత వరకు ఇవ్వలేదన్నారు. ఈ నెల 7,8న కలెక్టరేట్ ఎదుట రిలేదీక్షలు చేపట్టనున్నారని పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికులు పోరాటాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈనెల 7 ఆందోళన చేయనున్నారని చెప్పారు. గ్రామ పంచాయతి, మధ్యాహ్న భోజనం, ఆశ వర్కర్లకు కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వడం లేదన్నారు. అంగన్‌వాడీలకు తెలంగాణ కన్న వెయ్యి రూపాయలు అందనంగా ఇస్తామని చెప్పి రూ.2వేల తక్కువ ఇస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలో 25వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉన్నారని చెప్పారు. వీరిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఆప్కాస్ రద్దు చేయాలన్నారు. జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. విద్యుత్, మున్సిపల్, విఆర్ఎ, కాంట్రాక్ట్ కార్మికులు ఆందోళనలు చేపట్టాలని పిలుపులు నిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులురెడ్డి, కోశాధికారి లక్ష్మిదేవి, నగర అధ్యక్షులు చంద్రారెడ్డి పాల్గొన్నారు.

మహిళలు, బాలలకు దుస్తులు పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న వెంకట్రామిరెడ్డి

కడప అర్బన్: నగరం లోహియా నగరంలోని అంగన్ వాడి పాఠశాలలో శనివారం మహిళలు, బాలలకు నూతన వస్త్రాలను అందజేశారు. తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకుని లయన్స్ క్లబ్‌ఆఫ్ కడప అన్నమయ్య ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షులు లయన్ పోతుల వెంకట రామిరెడ్డి అధ్యక్షతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఇంటాక్ జిల్లా కన్వీనర్, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.చిన్నపరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంగన్వాడీ టీచర్ లక్ష్మీనరసమ్మ పర్యవేక్షణలో 50 మంది మహి ళలు, 25 మంది చిన్నారులకు చీరెలు, చొక్కా నిక్కర్లు, పిల్లలకు బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి జనార్ధనరాజు, కోశాధికారి రవీంద్రనాథ్, సంజీవరెడ్డి, కోటా సత్యనారాయణ, సుశీల్, కొండారెడ్డి, ముని కుమార్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అనుచితం

ప్రజాదృష్టి

భిన్నాభిప్రాయాలు, నిరసనలు ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువులు. ఇటువంటి ఉత్తమ విలువలకు భిన్నంగా ఇటీవల రాష్ట్రంలోని పులివెందుల, పుంగనూరు నియోజకవర్గ కేంద్రాల్లో అధికార పార్టీ వ్యవహరించడం ఆందోళకరం. పాలక పార్టీలు ప్రతిపక్ష పార్టీలు తమ రాజకీయ వైఖరుల్ని బలప్రయోగం ద్వారా అడ్డుకోవాలని చూడడం విస్మయకరం. దేశంలో, రాష్ట్రంలోనూ పాలక పార్టీలు అధికా రాన్ని అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాల నాయకత్వాలపై దాడులు, దౌర్జన్యాలకు తెగబడడం ప్రజాస్వామ్య విలువల్ని పాతాళానికి తొక్కేయడమేనని చెప్పవచ్చు. దేశంలోని రాజకీయ పార్టీలు ఏదైనా ఒక అంశంపై భిన్నాభిప్రాయాల్ని వెల్లడించొచ్చు. ఇటువంటి విలక్షణ వ్యవస్థలో పాలకపక్షాలు ఆయా ప్రతిపక్ష పార్టీలు తమ ఆలోచనలకు అనుగుణంగా స్పందించడం లేదనే ఉద్దేశంతో అసహనానికి గురి కావడం తగదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్ష పార్టీల భిన్నాప్రాయాల్ని, నిరసనల్ని సహించలేక పోవడం నియంతృత్వానికి సంకేతం. ఇటువంటి సంకేతాలు ప్రజా స్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటివని గుర్తించాల్సి ఉంది. అధికారంలో ఉన్న పాలక నాయకత్వం, ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు, ఉద్యోగ సంఘాలు చేసే విమర్శల్ని హుందాగా స్వీకరించాలి. అందులోని వాస్తవాలను అర్థం చేసుకుని తప్పులు దొర్లి ఉంటే సరిదిద్దుకో వడా నికి భిన్నాభిప్రాయాలు, నిరసనలు ఉపయోగపడతాయని గ్రహి ంచా లి. ప్రస్తుత పాలక పార్టీ భవిష్యత్‌లో ప్రతిపక్ష పార్టీగా మారే అవకాశాలు ఉన్నాయి. బండ్లు, ఓడలు, ఓడలు బళ్లు అవుతాయన్న సామె తను మరిచి చిత్తానికి తోచినట్లు ఇష్టానుసారంగా ప్రవర్తించడం తగదు. అధికారంలో ఉన్న పార్టీలు ప్రతిపక్షాల విమర్శల్ని సహించ లేక పోవడం, ప్రతిపక్ష పార్టీ నాయకత్వాలపై రాళ్లదాడులు, దౌర్జన్యా లకు పాల్పడడం విలువల పతనానికి సంకేతం. ఇటువంటి సహించ లేని పాలక పార్టీలు కాలగమనంలో కలిసిపోతాయని గమనించాల్సి ఉంది. అధికారం ఎవరికీ శాశ్వతం కాదనే సత్యాన్ని గుర్తించి, అధి కార, ప్రతిపక్ష పార్టీలు తమ బాధ్యతల్ని సక్రమంగా నిర్వహించాల్సి ఉంటుంది.పాలక, ప్రతిపక్ష పార్టీలు దిగజారిన పదజాలాన్ని ప్రయో గించడం అభ్యంతరకరం. సమాజం ఉత్తమ, మధ్యమ, అథమ శ్రేణులుగా ఉన్న సంగతి తెలిసిందే. ఇందులో ఉత్తమ కేటగిరీలోని మేధావులు, ఉత్తములు దిగజారిన పదజాల ప్రయోగాల్ని అసహ్యించుకుం టున్నారనే స్పృహ లేకుండా మాట్లాడడం విస్మయాన్ని కలిగిస్తోంది. గత సార్వత్రిక ఎన్నికల దగ్గర నుంచి దేశంలోని రాజకీయ పార్టీలు ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ప్రొఫెషనలిస్టుల ఆశ్రయిస్తున్న సంగతి తెలిసిందే. పార్టీల నిర్వహణ బాధ్యతల్ని సమర్థవంతంగా నిర్వహించ డానికి ఎన్నికల ప్రొఫెషనషలిస్టుల సహకారంతో వెళ్తున్నట్లుగా ప్రజా స్వామ్య విలువల్ని ఒంట బట్టించుకోవడానికి సైక్రియాటిక్, ఫిలాం త్రోఫిక్ ప్రొఫెషలిస్టులను నియమించుకోవాల్సిన పరిస్థితులు దగ్గర లోనే ఉన్నాయనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. ఇప్పటికైనా దేశం లోని రాజకీయ పార్టీలు ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ప్రాధా న్యత ఇవ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

మహిళల సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజాశక్తి-పోరుమామిళ్ల టౌన్



కిట్లు అందజేస్తున్న గోవిందరెడ్డి

మహిళల అభివృద్ధి, సంపూర్ణ ఆరోగ్యం మన జగనన్న ప్రభుత్వం ముఖ్య ఉద్దేశ్యం అని ఎమ్మెల్సీ డిసి.గోవిందరెడ్డి అన్నారు. పోరుమామిళ్లలోని బద్వేల్ రోడ్డులో ఉన్న పద్మావతి కళ్యాణ మండపంలో జరిగిన వైయస్సార్ సంపూర్ణ పోషణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బద్వేల్ నియోజకవర్గంలో దాదాపు 3500 మంది గర్భిణిలకు ఐసిడిఎస్ ద్వారా లబ్ధి చేకూరడం జరుగుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గర్భిణులకు పుట్ట బోయే బిడ్డ దృఢంగా, ఆరోగ్యంగా పుట్టాలంటే వారికి మంచి పౌష్టిక ఆహారాన్ని అందించాలనే ఉద్దేశంతో వారి ఇంటికే పోషకాహార కిట్లను పంపిణీ చేయడం శుభ పరిణామన్నారు. మహిళలు బలోపేతం కావాలని జగన్మోహన్ రెడ్డి అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలని వారి కొరకు అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కల్లూరి రమణారెడ్డి, రంగసముద్రం సర్పంచ్ రవి ప్రకాష్ రెడ్డి, ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్త విజయ ప్రతాపరెడ్డి, పిఆర్అండ్ఆర్‌డి సలహాదారులు నాగార్జున్‌రెడ్డి, ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి బద్వేల్ సిడిపిఒ లక్ష్మీదేవి, జడ్పిటిసి ముత్యాల ప్రసాద్, మండల ఉపాధ్యక్షులు సిఎం భాష, చెన్ను రాజశేఖర్, ఎంపిటిసి కల్వకురి రమణ నియోజకవక్గంలోని ఏడు మండలాలకు చెందిన అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అసైన్మెంట్ కమిటీలో అవకాశం కల్పించాలి

కడప అర్బన్: జిల్లాలోని అసైన్మెంట్ కమిటీలలో మాజీ సైనికులకు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా అవకాశం కల్పించాలని మాజీ సైనికుల సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మినారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎగ్జిక్యూటివ్ బోర్డు మెంబర్లుగా నియమించాలని ప్రత్యేకంగా సిఎం, కలెక్టర్‌కు ప్రత్యేక వినతి పత్రాలు పంపించామని తెలిపారు. మానవతా దృక్పథంతో పరిశీలించాలని పేర్కొన్నారు.

శాశ్వత లోక్ అదాలత్‌తోనే సత్వర న్యాయం

కడప: శాశ్వత లోక్ అదాలత్ ద్వారానే సత్వర న్యాయ పరిష్కారం జరుగుతుందని శాశ్వత లోక్ అదాలత్, పబ్లిక్ యుటిలిటీ సేవలు చైర్మన్ స్వర్ణ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప వారి ఆధ్వర్యంలో బసిరెడ్డి లా కాలేజీ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముక్యంగా ప్రజలలో చట్టాలపై తప్పక అవగాహన ఉండాలని అన్నారు. శాశ్వత లోక్ అదాలత్ రాష్ట్ర హైకోర్టు ఆధ్వర్యములో కేంద్ర ప్రభుత్వ ప్రత్యేక చట్టం ద్వారా ప్రభుత్వముచే ఏర్పాటు చేయబడినది. ఇందులోని తీర్పు భారత అత్యున్నత న్యాయస్థానము తీర్పుతో సమానమన్నారు. శాశ్వత లోక్ అదాలత్, పబ్లిక్ యుటిలిటీ సేవలు వివరించారు కార్యక్రమంలో లోక్ అదాలత్ మెంబర్స్, పి.బసి రెడ్డి లా కాలేజీ ప్రిన్సిపల్ రవీంద్ర రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ విశ్వనాథ్, లెక్చరర్లు, శాశ్వత లోక్ అదాలత్ మెంబర్ ఎమ్.వి.సుబ్బారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి స్వర్ణప్రసాద్

చంద్రబాబుపై దాడి గర్హనీయం

ప్రజాశక్తి - కడప అర్బన్

మాజీ ముఖ్యమంత్రి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు పుంగనూరు పర్యటనలో వైసిపి నాయకులు, కార్యకర్తలు జెండాలు పట్టుకుని వచ్చి రాళ్లదాడి చేయడం గర్హనీయమని టిడిపి రాష్ట్ర క్రిష్టియన్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు ఎం.పి. సురేష్ అన్నారు. శనివారం అంబేద్కర్ సర్కిల్ వద్ద రాళ్లదాడిని ఖండిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు పర్యటన ఉందని తెలిసి పోలీసులు ముందుస్తు చర్యలు చేపట్టడంలో విఫలమయ్యారని విమర్శించారు. కార్యక్రమంలో కడప పార్లమెంట్ మీడియా కో-ఆర్డినేటర్ జనార్ధన్, బెస్తసాధికర కమిటీ రాష్ట్ర కన్వీనర్ రామప్రసాద్, ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గురప్ప, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జియాదుద్దీన్, 46వ డివిజన్ ఇన్‌ఛార్జి భరత్ పాల్గొన్నారు.

దాడి అమానుషం : 'మన్సూరు'

పుగనూరులో టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు, కార్యకర్తలపై వైసిపి నాయకులు దాడి చేయించడం అమానుషమని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూరు అక్బర్ అన్నారు. శనివారం పాతబస్టాండ్ సమీపంలోని మన్సూరు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొంతమంది రౌడీ మూఖలతో రాళ్లు వేయించి టిడిపి కార్యకర్తల తలలు పగలకొట్టించారని విమర్శించారు. సమావేశంలో మైనారిటీ కార్యదర్శి నజీర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మంజూర్ అహమ్మద్, బిసి సెల్ ఉపాధ్యక్షులు దస్తగిరి, ఆటో నజీర్ పాల్గొన్నారు.

అత్యుత్తమ విద్యనందిస్తున్న 'వికాస్'


ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

నవోదయ, సైనిక్ స్కూల్లో అత్యుత్తమ విద్యను అందిస్తున్న సంస్థగా దిన్నెపాటి బసిరెడ్డి వికాస్ స్కూల్ (భగత్ సింగ్‌నగర్) గుర్తింపు పొందిందని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బసిరెడ్డి నవోదయ స్కూల్లో చదివి డాక్టర్‌గా స్థిరపడ్డాడని పేర్కొన్నారు. నవోదయ మరియు సైనిక్ స్కూల్లో చదివిన చాలా మంది విద్యార్థులు మంచి ఆఫీసర్స్‌గా సేవలందిస్తున్నారని గుర్తు చేశారు. అనంతరం నవోదయ, సైనిక్ స్కూలుకు సంబంధించిన కొత్త మెటీరియల్‌ను ఆవిష్కరించారు, కడప నగరంలో ఇటువంటి విద్యా సంస్థల నడుపుతున్న దిన్నెపాటి బసిరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో స్థానిక 45 డివిజన్ కార్పొరేషన్ ఇన్‌ఛార్జి గుత్తిరెడ్డి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

పోటీ ప్రపంచంలో నైపుణ్యత ముఖ్యం

ప్రజాశక్తి - కడప అర్బన్

పోటీ ప్రపంచంలో నైపుణ్యత ముఖ్యమని కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ రమణారెడ్డి అన్నారు. శనివారం నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్ సచివాలయంలో పనిచేస్తున్న వార్డు సెక్రటరీస్ నాలుగు రోజులు శిక్షణ కార్యక్రమము డిజిటల్ అడ్ సోషల్ మీడియా అవేర్నెస్ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయంలో పనిచేస్తున్న ప్రతి సిబ్బందికి నైపుణత చాలా అవసరమని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు మీద అవగాహన కల్పించాలని తెలిపారు. శిక్షణ పూర్తయిన వార్డు సెక్రెటరీ సర్టిఫికెట్స్, మెటీరియల్ ఇవ్వడం అందించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్లు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇంతియాజ్ అహమ్మద్, సిబ్బంది సుబ్బరామిరెడ్డి, తేజ, కళ్యాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమణారెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

రాష్ట్ర కౌన్సిల్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర కౌన్సిల్ మహాసభల పోస్టర్‌ను శనివారం కలెక్టర్ విజయ్‌రామరాజు ఆయన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ నెల 21,22 తేదీలలో ఏపియన్జివో అసోసియేషన్ 21 వ రాష్ట్ర కౌన్సిల్ మహాసభలు విజయవాడలో నిర్వహించనున్నారు. కార్యక్రమంలో యన్. జి వో జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శ డి.రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లా నుంచి 21 వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలకు భారీ ఎత్తున ఉద్యోగులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఉద్యోగస్తుల న్యాయమైన డిమాండ్లపై విజయవాడ కౌన్సిల్ సభ వేదికగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రసంగిస్తారని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో సహ అధ్యక్షులు తిమ్మారెడ్డి, జిల్లా నాయకులు నిత్యపూజయ, శ్రీనివాసులు, యన్. రాజశేఖర్,బాలపుల్లయ్య, జయలక్ష్మి, నగర అధ్యక్షులు చిన్నయ్య, కార్యదర్శి శైలేశ్వర్ రెడ్డి, నాయకులు ఆర్. నాగార్జున, రాజగోపాల్ రెడ్డి,పద్మనాభం, సుహాసిని, వెంకట్రామరాజు, సురేష్, తాడిపత్రి అధ్యక్షులు శ్రీనువాసులు పాల్గొన్నారు.

ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులుగా శ్రీరామమూర్తి

ప్రజాశక్తి-చెన్నూరు

ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులుగా చెన్నూరుకు చెందిన అల్లి శ్రీరామమూర్తి శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. డైరెక్టర్లుగా ఉప్పరపల్లికి చెందిన గాజుల పల్లె సంపూర్ణేశ్వర్‌రెడ్డి, కొండపాకకు చెందిన గంగులయ్య చేత సొసైటీ అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా వచ్చిన ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లా డుతూ చెన్నూరు సొసైటీ అంటే ఎంతో ప్రాముఖ్యత ఉందని ఇటువంటి సొసైటీకి బిసి వర్గానికి చెందిన శ్రీరామమూర్తిని ప్రెసిడెండ్‌గా నియమించడం ఎంత సంతోషించదగ్గ విషయమన్నారు. ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఎంతో ప్రాముఖ్యస్తుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్, మండల కన్వీనర్ జిఎన్. భాస్కర్‌రెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ ఆర్‌ఎస్‌ఆర్, ఆర్‌వి సుబ్బారెడ్డి, ముదిరెడ్డి సుబ్బారెడ్డి, సర్పంచులు తుంగ చంద్ర యాదవ్, సుదర్శన్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, చిన్న పరిశ్రమల డైరెక్టర్ వెంకటసుబ్బారెడ్డి, అడవి శాఖ డైరెక్టర్ శ్రీలక్ష్మి, రఘురాంరెడ్డి, వ్యవసాయ కమిటీ సలహాదారుడు ఎర్రసాని మోహన్‌రెడ్డి, డిపిఎం మాజీ చైర్మన్ పెడబల్ల ప్రతాపరెడ్డి, జయపాల్‌రెడ్డి, ఎంపిటిసి నాగిరెడ్డి, నిత్యపూజయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, శివశంకర్, రెడ్డయ్య పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

ప్రజల వద్దకే ప్రభుత్వ పథకాలు

ప్రజాశక్తి - దువ్వూరు


మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ప్రజల వద్దకే ప్రభుత్వ పథకాలు అని ఎమ్మెల్యే ఎస్.రఘు రామిరెడ్డి తెలిపారు. మండలంలోని జిల్లెల గ్రామంలో శనివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తనయుడు మైదుకూరు నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త శెట్టిపల్లి నాగిరెడ్డి గ్రామంలోని ప్రతి ఇంటికెళ్లి సంక్షేమ పథకాల అమలు గురించి అడిగి తెలుసుకున్నారు. టిడిపి ప్రభుత్వానికి, వైసిపి ప్రభు త్వానికి తేడాను ప్రజలకు వివరించారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహాశీల్దార్ రమా కుమారి, ఎంపిడిఒ జగదీశ్వర్‌రెడ్డి, ఎంపిపి కానాల జయచంద్రారెడ్డి, జెడ్పిటిసి మెరువ కృష్ణయ్య , నల్లగట్ల లక్ష్మిరెడ్డి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యానికి పదవ తరగతి కీలకం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని చేరుకునేందుకు పదవ తరగతినే కీలకమని వివేకానంద ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి తెలిపారు. రామేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు శనివారం కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతకడానికి మార్గాలు చాలా ఉంటాయని, విద్యార్థులు ఆసక్తి ఉన్న మార్గాన్ని ఎంచుకుంటేనే తృప్తితో కూడిన విజయం సొంత మవుతుందన్నారు. పదవ తరగతి తర్వాత ఏఏ రంగాలు ఉంటాయి.. అందులో ఏ రంగాన్ని ఎంచుకోవాలి అనే విషయాలు తమ సంస్థ కెరీర్ గైడెన్స్ పేరుతో ఒక పుస్తకాన్ని ప్రింట్ చేయించిందన్నారు. దాన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని పదవ తరగతి విద్యార్థులకు పంపిణీ చేస్తున్నామన్నారు. పాఠశాలలోని 100 మందికి ఆ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి టి.వెంకటసురేష్, ప్రధానోపాధ్యాయులు సత్యబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పుస్తకాలు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠం

ప్రజాశక్తి - ఖాజీపేట

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమైనవని, తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి అధికంగా ఉంటుందని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపర్వైజర్ శ్రీదేవి అన్నారు. శనివారం మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తల్లిపాల ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ జప్రాబి, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పార్నపల్లిలో వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - లింగాల


పరిశీలిస్తున్న పోలీసులు

మండలంలోని పార్నపల్లి గ్రామంలో చల్ల ఈశ్వరయ్య (65) దారుణ హత్యకు గురయ్యాడు. పులివెందుల సిఐ బాల మద్దిలేటి వివరాల మేరకు.. ఈశ్వరయ్య పార్నపల్లి గ్రామ సమీపంలోని కోన మల్లేశ్వర స్వామి దేవాలయంలో వాచ్ మెన్‌గా పనిచేస్తుండేవాడు. శుక్రవారం అర్ధరాత్రి హత్యకు గురయ్యాడు. రోకలి బండతో తలపై కొట్టడంతో ఈశ్వర య్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి ఒక కుమార్తె. హత్యకు గల కారణాలు తెలియలేదని, విచారి స్తున్నామని సిఐ తెలిపారు. హత్య జరిగిన తర్వాత అక్కడి వంట మాస్టర్ రామాం జనేయులు కనిపించడం లేదు. ఒకవేళ డబ్బు కోసం వంట మనిషి హత్య చేశాడా లేక, మరెవరైనా చేశారా అనేదానిపై విచారిస్తామన్నారు. హత్య జరిగిన ప్రదేశానికి కడప నుంచి డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం రప్పించామన్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం పులివెందుల ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు సిఐ తెలిపారు.

వాలంటీర్ ఆత్మహత్య

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని కొత్త రాజువారిపేటకు చెందిన ఆవుల వీరవంశీ (24) చీరతో ఉరి వేసుకుని మృతి చెందిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. స్థానికులు అందించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వరలక్ష్మికి ఇద్దరు కుమారులు. వీరిలో చిన్నకుమారుడు వీరవంశీ వాలంటీరుగా విధులు నిర్వహిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం కడపలో ఉన్న అమ్మ వరలక్ష్మి సెల్ ఫోనుకు వీడియో కాల్ చేసి తాను ఉరివేసుకొని చనిపోతున్నట్లు చెప్పాడు. ఆమె అప్రమత్తమై ఇంటి పక్కన వారికి ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే స్థానికులు వాకిళ్లు పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా ఇనుప కడ్డీకి చీర కట్టుకొని వేలాడుతూ కనిపించాడు. వెంటనే కిందకు దింపి చూడగా కోన ఊపిరితో ఉన్నట్లు గుర్తించి, 108లో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందించేలోగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. యువకుడు చనిపోవడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.


వీరవంశీ (ఫైల్‌ఫొటో)

చెన్నూరులో వివాహిత..

చెన్నూరు : స్థానిక కొత్త గాంధీనగర్‌కు చెందిన సాల మహాలక్ష్మి (36) అనే వివాహిత శనివారం ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. పెళ్లి అయినప్పటి నుండి భర్త రోజూ తాగి కొట్టడం, హింసించడం, చావు అని బాధపెడ్డడాన్ని భరించలేక, అత్త కూడా తన భర్తకే సపోర్ట్ చేసేది. ఈ క్రమంలో శనివారం ఉదయం భర్త, అత్త కొట్టడంతో విరక్తి చెంది ఆమె ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి సీతమ్మ ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.


మహాలక్ష్మి (ఫైల్‌ఫొటో)

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో శనివారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో ఇరువురు ద్విచక్ర వాహన దారులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు.. కడప-కర్నూలు ప్రధాన రహదారిలో ద్వారకా నగరం వద్ద మైదుకూరు నుంచి దువ్వూరుకు వెళుతున్న ద్విచక్ర వాహనదారుడ్ని వెనుక వైపు నుంచి వస్తున్న కారు ఢీకొని నిలుపకుండా వెళ్లిపోయింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంలో ప్రయాణిస్తున్న దువ్వూరు మండలానికి చెందిన నాగమునెయ్యకు బలమైన గాయాలై, అపస్మారక స్థితిలోకి వెళ్లారు. స్థానికులు 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చాపాడులోని నాలుగు రోడ్ల కూడలి వద్ద వేగంగా వెళుతున్న ద్విచక్ర వాహనం నుంచి కిందపడి మైదుకూరుకు చెందిన అరీఫ్ అనే యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు 108 సహాయంతో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ద్వారకానగరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం

సాగు పట్టాల కోసం ఎదురుచూపులు

మండలంలో 1,500 దరఖాస్తులు - ఇందులో పలు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న రైతులు పట్టాల కోసం ఎదురు చూస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం అర్హతగల రైతులకు పట్టాలు అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ నేపథ్యంలో మండల వ్యాప్తంగా దాదాపు 1,500 మంది రైతులు తాము ప్రభుత్వ భూమిని సాగు చేసుకుంటున్నామని, కావున పట్టాలివ్వాలని దరఖాస్తు చేశారు. అయితే వాస్తవంగా సాగులో ఉండే వారి కంటే ఎక్కువ మంది దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులు ఆయా గ్రామాల్లో నివాసం ఉండి సాగు చేసుకునే వాళ్లకు మాత్రమే ఇవ్వాల్సి ఉంది. నియోజవర్గంతోపాటు, ఇతర జిల్లాలకు చెందిన వారు సైతం దరఖాస్తు చేశారు. ముఖ్యంగా మండలంలోని ఒక గ్రామం నుంచి దాదాపు 400 దరఖాస్తులు చేశారు. ప్రముఖులు, రాజకీయ నాయకులు సైతం పట్టాల కోసం దరఖాస్తు చేయడం పట్ల సాగులో ఉన్న రైతులు ఆందోళనలో ఉన్నారు. తమకు పట్టాలు వస్తాయో లేదోనని నిజమైన రైతులు ఆవేదన చెందుతున్నారు. అర్హతలేని వారికి సైతం పట్టాలు ఇచ్చేందుకు కొంతమంది రెవెన్యూ సిబ్బంది తాయిలాలు పుచ్చుకొని వారే దగ్గరుండి దరఖాస్తులు చేయించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.


పట్టాలివ్వాల్సిన భూమి

అర్హతగల వారికే పట్టాలు

ఈ విషయమై తహాశీల్దార్ మహబూబ్‌బాషాను వివరణ కోరాగా.. ఎక్కువమంది దరఖాస్తు చేసుకున్న విషయం వాస్తవమే. అర్హతగల వారికి మాత్రమే పట్టాలిస్తాం. ఇందులో సిబ్బంది అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవు.

- మహబూబ్‌బాషా, తహాశీల్దార్

'ఉక్కు'పై రాజకీయ పార్టీల వైఖరి స్పష్టం చేయాలి


మాట్లాడుతున్న వీరనాల శివకుమార్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కేంద్ర ప్రభుత్వం కడప ఉక్కు సాధ్యం కాదని పార్లమెంటు సాక్షిగా చెప్పడం దారుణమని, దీనిపై అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి స్పష్టమైన వైఖరి తెలపాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కడప ఉక్కుపై దుర్మార్గంగా వ్యవహరిస్తోందన్నారు. విభజన చట్టంలో స్పష్టంగా రాష్ట్రానికి కడప ఉక్కును చట్టబద్ధంగా కేటాయించినా, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఇప్పుడు కడప ఉక్కును ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యంగా ఉంటోందన్నారు. కడప ఉక్కు ఇక్కడి ప్రజల చిరకాల వాంఛ అన్నారు. యువతకు సంజీవని లాంటిదన్నారు. ఉద్యోగ, ఉపాధి పరిశ్రమ కడప ఉక్కు ద్వారానే ఇక్కడి యువతకు సాధ్యమన్నారు. పార్లమెంటులో కేంద్రాన్ని నిలదీసి, కడప ఉక్కు కోసం ఎంపీలు రాజీనామా చేయాలన్నారు. భవిష్యత్‌లో కడప ఉక్కు కోసం ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా కడప కేంద్రంగా ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. ఈ పోరాటంలో అందరూ కలసి రావాలని శివకుమార్ పిలుపునిస్తున్నామన్నారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్‌రాజ్, జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కొంతకాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను వెంటనే తీర్చాలని కార్మిక నాయకులు కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శనివారం ప్రొద్దుటూరు మున్సిపల్ కార్మిక సంఘం (సిఐటియు అనుబంధం) నాయకులు విలేకరుల సమావేశంలో జిల్లా వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ విజయకుమార్‌మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. సమానపనికి తగిన వేతనం ఇవ్వాలన్నారు. ఆప్కాస్ రద్దు చేయాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. కార్మికులందరికీ సొంతింటి కలను నెరవేర్చాలన్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు టెక్నికల్ వేతనాలు ఇవ్వాలన్నారు. బ్యాబ్ డ్రైవర్లకు జిఓ7 ప్రకారం రూ.18,500 ఇవ్వాలన్నారు. ఈ డిమాండ్లపై ఈనెల 1న చేపట్టిన మున్సిపల్ కార్యాలయ ముట్టడి కార్యక్రమం విజయవంతమైందన్నారు. ఈనెల 7న తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల17న చలో విజయవాడ కార్యక్రమం ఉంటుందన్నారు. అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే నిరవధిక సమ్మెకు సైతం వెనకాడబోమని తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు చంటి, సాల్మన్, కోశాదికారి రాఘవేంద్ర పాల్గొన్నారు.


మాట్లాడుతున్న యూనియన్ నాయకులు విజయకుమార్

నులిపురుగుల నివారణే లక్ష్యంగా పనిచేయాలి


ఎంపిడిఒ భాగ్యలక్ష్మికి మాత్రలు అందిస్తున్న డిఎంహెచ్ఒ నాగరాజు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

నులిపురుగుల నివారణే లక్ష్యంగా పనిచేయాలని అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లకు ఏర్పాటు చేసిన సమావేశంలో డిఎంహెచ్ఒ నాగరాజు తెలిపారు. స్థానిక పిహెచ్‌సిలో శనివారం ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లకు సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా నాగరాజు, మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్, ఎంపిడిఒ భాగ్యలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ నాగరాజు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా డి వార్మింగ్ డేను ఈనెల 10న నిర్వహించేలా కేంద్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, మొదటి సంవత్సరం చదువుతున్న కాలేజీ విద్యార్థులకు తప్పనిసరిగా నులి పురుగుల నివారణ మాత్రలను అందివ్వాలని సూచించారు. ఒకటి నుండి అయిదేళ్లలోపు పిల్లలకు భోజనం అనంతరం పొడిగా చేసిన మాత్రలను ఇవ్వాలన్నారు. డి వార్మింగ్ డేను జయప్రదం చేయాలని వైద్యులకు ఆదేశాలిచ్చారు. పోలియోను సమూలంగా నిర్మూలించినట్లే నులి పురుగుల నిర్మూలనకు కూడా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు నాగార్జున, జోత్స్న, శ్రీనాథ్‌రెడ్డి, సూపర్వైజర్ ఓబులేసు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఒఎస్‌డి

గడువులోగా పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

గడువులోపు జగనన్న కాలనీలో అన్ని పనులు పూర్తి చేయాలని పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన మున్సిపల్ ఇన్‌ఛార్జి మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వి.వర ప్రసాద్, వైస్ చైర్మన్ యస్ హాఫీజుల్లా, కమిషనర్ వివి నరసింహ రెడ్డితో కలిసి జగనన్న మెగా లే అవుట్‌ను పరిశీలించారు. కాలనీలో జరుగుతున్న రోడ్డు పనులు, యుజిడి, నీటి సరఫరా పైప్‌లైన్ పనుల పురోగతిని తనిఖీ చేశారు. అనుమతి పొందిన ప్లాన్ ప్రకారం ఇచ్చిన గడువు లోపు నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. పనులలో నాణ్యత లోపిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. కార్యక్రమంలో డిఇ సురేంద్ర బాబు, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డి, కౌన్సిలర్ కిషోర్, అధికారులు పాల్గొన్నారు.

సిఎం పదవి కోసమే చంద్రబాబు అరాచకం

ప్రజాశక్తి - వేంపల్లె

ముఖ్యమంత్రి పదవి కోసం టిడిపి అధినేత చంద్రబాబు అరాచకం చేయడం శోచనీయమని వైఎస్ఆర్ విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి రహంతుల్లా ఖాన్ తెలిపారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుంగనూరులో టిడిపి కార్యకర్తలు రెచ్చిపోయి వైసిపి కార్యకర్తలపై దాడులు చేస్తే, వాటిని ఆపకుండా మరింతగా చంద్రబాబు రెచ్చగొట్టడం సరైందికాదన్నారు. టిడిపి కార్యకర్తలు పోలీసు వాహనాలను ధ్వంసం చేయడం దురదృష్టకరమన్నారు. చంద్రబాబు పుంగనూరు హైవే మీదుగా వెళ్లకుండా రూట్ మార్చడం వల్లే ఘర్షణ జరిగినట్లు చెప్పారు. పుంగనూరులో జరిగిన విధ్వంసానికి కారణం చంద్రబాబే అన్నారు. సమావేశంలో వైస్ ఎంపిపి బాబా షరీఫ్ పాల్గొన్నారు.

నామ మాత్రంగా మండల సమావేశం


ప్రజాశక్తి - ముద్దనూరు

గ్రామాలను అభివృద్ధిబాటలో నడిపేందుకు నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం శనివారం నామమాత్రంగా సాగింది. సమావేశాన్ని ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో ఎంపిపి-1 రేణుక, వైస్ ఎంపిపి పుష్ప లత ఆధ్వర్యంలో ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

లింగాల ఇన్‌ఛార్జి ఎంపిపిగా రమాదేవి

ప్రజాశక్తి - లింగాల

లింగాల ఇన్‌ఛార్జి ఎంపిపిగా అలవలపాటి రమాదేవిని నియమిస్తున్నట్లు ఎంపిడిఒ సురేంద్ర నాథ్ తెలిపారు. గతంలో ఎంపిపిగా ఉన్న అమృతదేవి వ్యక్తి గత కారణాల వల్ల గత వారం కిందట రాజీనామా చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో వైస్ ఎంపిపిగా ఉన్న రమాదేవిని శనివారం ఎంపిపిగా ఎన్నుక్నుట్లు వివరించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లా డుతూ తనకు ఎంపిపిగా అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



రెండు రోజుల్లో సర్వే పూర్తి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

సోషల్ ఎకనామిక్ సర్వేను రెండు రోజుల్లో పూర్తి చేయాలని మెప్మా అధికారి గంగులయ్య సూచించారు. శనివారం స్థానిక మెప్మా కార్యాలయంలో ఆర్పీలకు, కింద స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గంగులయ్య మాట్లాడుతూ జగనన్న హౌసింగ్ లబ్ధిదారుల వాటా రూ.35లు పెండింగ్ ఉన్నవారితో మాట్లాడి కట్టించాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో భాగంగా ప్రజల అభిప్రాయాలను ప్రతి సంఘ సభ్యులచే చేయించాలని తెలిపారు.

ఆదరించే గుణం చాలా గొప్పది

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఒక ప్రాణి మరొక ప్రాణిని ఆదరించి, అభిమానించే గుణం చాలా గొప్పదని మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణ్‌రావు తెలిపారు. స్థానిక శ్రీ అమ్మానాన్న వృద్ధాశ్రమానికి చెందిన ఉప్పల సుబ్బలక్షుమ్మ అనే అనాథ అనారోగ్యంతో మృతి చెందగా.. ఫౌండేషన్ నిర్వాహకులు అంతిమ సంస్కరణలు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ శుభకార్యాలయాలకు అందరూ ముందుంటారు కానీ, ఇలాంటి కార్యక్రమాలకు వెనకడుగు వేయడం శోచనీయమన్నారు. తన ఆధ్వర్యంలో శ్రీ అమ్మ శరణాలయం నిర్వహిస్తున్నామని, దాతలు సహకరించాలని ఆయన కోరారు.

కుందూ వంతెనపై రోడ్డుకు మరమ్మతులు


గుంతలకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు-ప్రొద్దుటూరు ప్రధాన రహ దారిపై కుందూ నది వం తెనపై రోడ్డుకు అధికారులు మరమ్మతులు చేపట్టారు. రోడ్డుపై ఉన్న పెద్ద గుం తలతో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడే వారు. సమస్యపై స్పందించిన అధికారులు వంతెన, గోడేరు వంకపై ఉన్న గుంతలను కంకర, తారతో పూడ్చారు. గుంతలను పూడ్చి తారు రోడ్డుతో పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టడంతో ప్రయాణికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో గ్రావెల్ మట్టితో గుంతలు పూర్తయినప్పటికీ వర్షపు నీటికి కొట్టుకుపోయి మళ్లీ గుంతలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం రాత్రి సమయాల్లో ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా అధికారులు మరమ్మతులు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

చట్ట వ్యతిరేకంగా ఎవరైన వ్యవహరిస్తే కఠినచర్యలు తప్పవని టూ టౌన్ సిఐ నారాయణ యాదవ్ హెచ్చరించారు. ఎస్పి కెకెఎన్ అన్బురాజన్ ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని ఆయా ప్రాంతాల్లో పోలీసులు కార్డెన్ అండ్ సెర్చ్ నిర్వ హించారు. ఇందులో భాగంగా సుబ్బిరెడ్డి కొట్టా లులో అనుమానిత వ్యక్తుల ఇళ్లల్లో, పరిసరాల్లో పోలీ సులు క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అనుమా నాస్పదంగా వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారమివ్వాలని సిఐ ప్రజలకు సూచించారు.కార్యక్రమంలో టూ టౌన్ పోలీసులు పాల్గొన్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న సిఐ నారాయణ యాదవ్, పోలీసులు

చంద్రబాబుపై రాళ్ల దాడి దుర్మార్గం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

చిత్తూరు ఉమ్మడి జిల్లా పుంగనూరులో పర్యటిస్తున్న చంద్రబాబు కాన్వాయ్‌పై వైసిపి కార్యకర్తలు రాళ్లదాడి చేయడం దుర్మార్గమని ప్రొద్దుటూరు టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఖండించారు. చంద్రబాబుపై దాడికి నిరసనగా శనివారం పాత బస్టాండ్ లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు సీఎం సురేష్ నాయుడు, రాష్ట్ర కార్యదర్శి ముక్తియార్, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, నాయకులు బండి భాస్కర్‌రెడ్డి, ఘంటసాల వెంకటేశ్వర్లు, తాటి శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు

రక్షణ పంటగా సజ్జ సాగు చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

పంటలకు రక్షణగా పొలం చుట్టూ సజ్జను సాగు చేయాలని ఎఒ రాజేంద్రప్రసాద్ సూచించారు. మండలంలోని ముత్తుకూరు గ్రామరైతు బాబు పొలంలోని 20 సెంట్ల భూమిలో శనివారం ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో ఎటిఎం మోడల్ నాటారు. ఈ సందర్భంగా ఎఒ మాట్లాడుతూ ఎటిఎం మోడల్ విధానంలో పంటలు సాగు చేయడం వల్ల 365 రోజులు ఆదాయం వస్తుందని రైతులకు సూచించారు. కూరగాయల సాగు చేయడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అన్ని రకాల ఆకుకూరలు, కూరగాయలు తినడం వల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉంటుందని తెలిపారు. 365 రోజులు పలు పంటలు సాగు చేయడం వల్ల భూమి సారవంతంగా ఉంటుందని తెలిపారు. రైతులకు కూరగాయల సాగుపై శిక్షణనిచ్చామన్నారు. టమోటా, వంగ, బెండ, మిరప, గోరుచిక్కుడు, అలసంద, ముల్లంగి, క్యారెట్, బీట్‌రూట్, గోంగూర, కొత్తిమీర, మెంతికూరను అంతర పంటలను సాగు చేయాలని కోరారు. 20 సెంట్లు భూమిలో 100కిలోల ఘన జీవామృతం విత్తనంతోపాటు వేయాలని కోరారు. బీజామృతంతో విత్తనశుద్ధి చేసి విత్తనాలు నాటాలని కోరారు. టమోటా, వంగా, మిరప, బంతినారును శద్ధి చేసి నాటాలని వివరించారు.


విత్తనశుద్ధిపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ రాజేంద్రప్రసాద్


మాట్లాడుతున్న ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వసంతకుమారి

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలిని ప్రభుత్వ వైద్యులు హుస్సేన్ కుమార్ సూచించారు. మండల కేంద్రమైన సింహాద్రిపురం అంగన్వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతలకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంతకుమారి, వైద్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రెగ్యులర్ డిప్యూటీ డిఇఒను నియమించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కడప తర్వాత ఆ స్థాయి కలిగిన ప్రొద్దుటూరుకు రెగ్యులర్ డిప్యూటీ డిఇఒ లేకపోవడం వల్ల విద్యారంగంపై ఆ ప్రభావం పడుతోందని, వెంటనే నియమించాలని పిడిఎస్ఒ రాయలసీమ కన్వీనర్ ఓబులేసు కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ విద్యాశాఖ కార్యాలయం పరిధిలో 17 మండలాలున్నాయన్నారు. వందల్లో ప్రైవేటు పాఠశాలలు, 130 ఉన్నత పాఠశాలలు, వేల సంఖ్యలో విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. గత జులై నెలలో వైవిఎస్ బాలికోన్నత పాఠశాలలో ఓ వివాదాస్పద సంఘటన జరిగిందన్నారు. పరస్పరం కలహించుకునే పరిస్థితి జరిగినా, జిల్లా విద్యాశాఖాధికారులు ఆ పాఠశాల వైపు కన్నెత్తి చూడలేదన్నారు. కడప ఇన్‌ఛార్జి డిప్యూటీ డిఇఒ నామమాత్రంగా వచ్చి వెళ్లారన్నారు. పాఠశాలల పర్యవేక్షణ గాలి కొదిలేశారన్నారు. నాడు-నేడు పనులు పట్టించుకోవడంలేదన్నారు. జమ్మలమడుగులో ఇటీవల ఓ విద్యార్థిని బస్సు కింద పడి దుర్మరణం పాలైందని ఆవేదన వ్యక్తం చేశారు. చింతకొమ్మదిన్నె మండలంలో ఓ మూడవ తరగతి విద్యార్థిని మృతి బాధాకరమన్నారు. ఇలాంటి సంఘటనలు తరచు జరుగుతున్నప్పటికీ అధికారుల్లో స్పందన లేకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రొద్దుటూరుకు రెగ్యులర్ డిప్యూటీ డిఇఒను నియమించాలని ఆయన కోరారు.